క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

యాకుత్‌పురా: విద్యుత్ మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. నీలం సెంటర్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

మెహిదీపట్నం విద్యుత్ డివిజన్ పరిధిలో..
లంగర్‌హౌస్: విద్యుత్ మరమ్మతుల కారణంగా మెహిదీపట్నం విద్యుత్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ సరోజినీదేవి ఆస్పత్రి సబ్‌స్టేషన్ పరిధిలోని సయ్యద్‌నగర్-1, 2, అహ్మద్‌నగర్, ఫస్ట్ లాన్సర్, బోలానగర్, శ్రీరాం నగర్, బడాబజార్, పోచమ్మబస్తీ, మాసబ్‌ట్యాంక్, గార్డెన్ టవర్స్, పోలీస్‌మెస్, ఖాజా మెన్షన్, ఖాదీబోర్డు, ఖాజానగర్, డైమండ్ హోటల్, ఫజల్ రెసిడెన్సీ, బంజారా ఫంక్షన్ హాల్, బోలానగర్, కబరస్థాన్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

22వ తేదీ నుంచి రామోత్సవాలు

విజయనగర్‌కాలనీ: శ్రీరామచంద్రుని గుణగణాలను బాలబాలికల్లో పెంపొందించేందుకు విశ్వహిందూ పరిషత్ మాతృశక్తి కృషి చేస్తుందని పరిషత్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం విజయనగర్‌కాలనీ లక్ష్మీగణపతి ఆలయ ప్రాంగణంలో గోల్కొండ జిల్లా సంయోజిక వూటుకూరు కాళింది తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 22 నుంచి 30వ తేదీ వరకు రామోత్సవాలు పేరిట మెహిదీపట్నం గుడిమల్కాపూర్ సాయిబాబా ఆలయ ప్రాంగణంలోని శివాలయంలో ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. నవరాత్రుల పాటు జరిగే భక్తి సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనదలచిన బాలబాలికలు, మహిళలు ఈనెల 21వ తేదీలోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 93902 35525, 79896 42115 నెంబర్లలో సంప్రదించవచ్చు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



నర్మదసింగ్‌ను సత్కరించిన దృశ్యం

అబిడ్స్: బేగంబజార్ మచ్చీమార్కెట్ వద్ద ఉన్న దుర్గామాత ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పిష్‌మార్కెట్, బేగంబజార్, జలక్షత్రియ, ఫిష్‌మార్కెట్ అసోసియేషన్, గంగపుత్ర సమాజ్ వాళ్లు పెద్ద ఎత్తున అమ్మవారికి పూజలు చేశారు. ఈ వేడుకల్లో కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు నర్మదసింగ్ పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో పర్వంత్‌సింగ్, నారాయణ్ సింగ్, రాజ్‌కుమావత్ సింగ్, సుధీర్ సింగ్ పాల్గొన్నారు.

బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న రామ్ అగర్వాల్

గన్‌ఫౌండ్రీ: 25 ఏళ్లుగా వినియోగదారుల మన్ననలను పొందుతున్న పూజ చీరలు, డిజైన్ స్టూడియో సిల్వర్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు సంస్థ ఎండీ రామ్‌అగర్వాల్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం అబిడ్స్‌లోని వస్త్ర షోరూమ్‌లో వేడుకల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈనెల 31వ తేదీ వరకు 35శాతం తగ్గింపుతో పలు రకాల ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. సిల్వర్‌జూబ్లీ వేడుకలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన లక్కీ కూపన్‌లో గెలుపొందిన వినియోగదారుడికి దుబాయ్ ట్రిప్, ఫలక్‌నుమా ప్యాలెస్‌లో భోజనం చేసే అవకాశాన్ని పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు క్రిష్ మిట్టల్, నిధి అగర్వాల్, ఖుష్బు పాల్గొన్నారు.

చేతి పంపులకు మరమ్మతులు



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

జియాగూడ: జియాగూడలో నీటి ఎద్దడి నివారణకు బస్తీలలో పాడైన చేతి పంపులకు మరమ్మతులు చేపడుతున్నట్లు జియాగూడ కార్పొరేటర్ బోయిని దర్శన్ అన్నారు. ఈ మేరకు ఆదివారం డివిజన్‌లోని సంజయ్‌నగర్, డబుల్‌బెడ్‌రూమ్, బంగిబస్తీ, సులేమాంజ బక్చరా తదితర ప్రాంతాల్లో పాడైన చేతి పంపులకు మరమ్మతులు చేపట్టారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. బస్తీలలో ఉన్న బోరింగ్‌లకు మరమ్మతులు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. డివిజన్ బీజేపీ ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు రాహుల్‌కుమార్, జవహర్ పాల్గొన్నారు.

గోల్కొండ కోటలో పర్యాటకుల సందడి



గోల్కొండ: గోల్కొండ కోటకు ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. ఉదయం 7 గంటల నుంచే పర్యాటకులు కోట గేటు వద్ద ఎంట్రీ కోసం బారులుతీరారు. వచ్చిన పర్యాటకులలో ఇతర రాష్ట్రాలకు చెందిన వారే ఎక్కువగా ఉన్నారు. టికెట్ కౌంటర్ దాటి బాలహిస్సార్ గేటులోకి ప్రవేశించగానే పర్యాటకులు కోట గోడలను చూసి ఆశ్చర్యపోయారు. గోల్కొండ బాలహిస్సార్ గేటులోని క్లాపింగ్ పోర్టికోవద్ద యువతీ యువకులు సుమారు గంటన్నర సేపు అక్కడ ఉన్న క్లాపింగ్ పరికరం విశేషాలను తెలుసుకుంటూ గడిపారు. అనంతరం చీకటి గుహలుగా ఉన్న సైనికుల గదులను చూస్తూ అకన్న-మాదన్న కార్యాలయాలను సందర్శించారు. ఆ తరువాత రాణీ మహల్ వద్ద పర్యాటకులు రాణీ మహల్ నిర్మాణ విశేషాలను, కుతుబ్‌షాహీల రాజుల కాలంలో ఫౌంటేన్ విశేషాలను అక్కడున్న హిస్టరీ గైడ్స్‌ను అడిగి తెలుసుకున్నారు.

దళితుల అభ్యున్నతికి ప్రధాని మోదీ కృషి



లాల్‌సింగ్‌ను సన్మానిస్తున్న ప్రేమ్‌కుమార్

జియాగూడ: దేశంలో దళితుల అభ్యున్నతికి ప్రధాని మోదీ ఎనలేని కృషి చేస్తున్నారని బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లాల్‌సింగ్ ఆర్య అన్నారు. ఈ మేరకు ఆదివారం జియాగూడలో గోల్కొండ జిల్లా బీజేపీ ఎస్సీ మోర్చా కోశాధికారి ఆర్.ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటైన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై భారత మాత, అంబేడ్కర్ చిత్రపటాల వద్ద జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించాలని కోరారు. కాంగ్రెస్ 50 ఏళ్ల పరిపాలనలో దళితుల అభివృద్ధికి కృషి చేసింది ఏమీ లేదని ఆరోపించారు. అనంతరం లాల్‌సింగ్ ఆర్య, రాష్ట్ర బీజేపీ ఎస్సీమోర్చా అధ్యక్షుడు కొప్పు భాషా, గోల్కొండ జిల్లా బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు రాజేందర్ డెగాన్‌లకు ప్రేమ్‌కుమార్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి కాంతికిరణ్, అధికార ప్రతినిధి చంద్రశేఖర్, జియాగూడ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, యువమోర్చా అధ్యక్షులు రాజ్‌పోల్, ప్రధాన కార్యదర్శి సంతోష్, మదిర సత్యనారాయణ, నర్సింహ పాల్గొన్నారు.

ఉత్సవాల బ్రోచర్ విడుదల



బ్రోచర్ విడుదల చేస్తున్న కమిటీ సభ్యులు

చాంద్రాయణగుట్ట: లలితాబాగ్ మల్లికార్జుననగర్‌లోని విఘ్నేశ్వర సాయి దామంలో 22వ శ్రీ సీతారామచంద్ర స్వామి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు చైర్మన్ మిద్దెల చంద్రశేఖర్ రెడ్డి, వైస్ చైర్మన్ సుశీల్ కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దాదాపు 4000 మంది వరకు విచ్చేయనున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

మసీదు ప్రారంభం

గోల్కొండ: రంజాన్ మాసం ఎంతో పవిత్రమైందని మౌలానా ఫజల్ ఉర్ రహమాన్ అన్నారు. ఆదివారం నానల్‌నగర్ డివిజన్‌లోని హకీంపేట్‌లో కొత్తగా నిర్మించిన మజిద్ అల్ మదీనాను ఆయన కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్‌తో కలిసి ప్రారంభించారు. ఆయన ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రంజాన్ నెల రోజుల ఉపవాస దీక్షలు పాటించిన వారు దైవకృపకు పాత్రులు అవుతారన్నారు.



మసీదు ప్రారంభోత్సవ కార్యక్రమం

కవయిత్రి లహరికి జాతీయ పురస్కారం



లహరికి పురస్కారం అందజేస్తున్న దృశ్యం

అబిడ్స్: జాతీయ తెలుగు సాహిత్య సాంస్కృతిక భాషా సంస్థ కర్ణాటక తెలుగు రచయితల సమైక్య ఉగాది జాతీయ పురస్కారం 2023 అవార్డును వర్తమాన కవయిత్రి లహరికి ఆదివారం అందజేశారు. తెలుగు సాహిత్యంలో చేస్తున్న కృషి, ప్రతిబింబించే కవితా సంపుటి అక్షర నేత్రాలకు ఈ జాతీయ పురస్కారం లభించడం ఎంతో ఆనందంగా ఉందని కవయిత్రి లహరి పేర్కొన్నారు. కవయిత్రి లహరికి బెంగళూర్‌లో జరిగిన కార్యక్రమంలో జాతీయ పురస్కారాన్ని అందజేసి ఘనంగా సత్కారం చేశారు.

హిదాయత్ అలీఖాన్‌కు సన్మానం



అలీఖాన్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: 20 ఏళ్లుగా ఎందరో పేద పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దిన మహ్మద్ హిదాయత్ అలీఖాన్ అభినందనీయుడని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. ఆదివారం గోల్కొండ అలయన్స్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో మహ్మద్ హిదాయత్ అలీఖాన్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా వీనస్ విద్యాసంస్థల డైరెక్టర్ అయిన హిదాయత్‌అలీఖాన్ మాట్లాడుతూ.. సేవా దృక్పథంతోనే తాను ముందుకు సాగుతున్నానన్నారు.

పేద విద్యార్థులకు ఉచిత విద్యనందించడమే లక్ష్యం



సమ్మేళనంలో పాల్గొన్న గడ్డం శ్రీనివాస్‌యాదవ్

సుల్తాన్‌బజార్: గోషామహల్ నియోజకవర్గం నుంచి చదువుకు నోచుకోలేని విద్యార్థులను హక్కున చేర్చుకుని వారికి ఉచితంగా విద్యనందించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని గడ్డం గంగాధర్ యాదవ్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు గడ్డం శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం గన్‌ఫౌండ్రీ డివిజన్‌లోని వెస్లీబాగ్‌లోని రెసిడెన్షియల్ కాలనీలో క్రిస్టియన్ ఆత్మీయ సమ్మేళనం, బసయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన గడ్డం శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గంలో తమ ఫౌండేషన్ ద్వారా ఇప్పటి వరకు దళితవాడలో బసయాత్రలో, మైనార్టీవాడలో బసయాత్ర, క్రిస్టియన్‌వాడలో బసయాత్ర వంటి 10 కార్యక్రమాలు నిర్వహించామని ఆయన తెలిపారు. ఇప్పటి వరకు 1850 మంది విద్యార్థులకు ఉచితంగా ఇంటర్, డిగ్రీ, పీజీ చదువులు చెప్పించేందుకు తమ ఫౌండేషన్ ద్వారా దరఖాస్తులను తీసుకున్నామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వెస్లీబాగ్ స్థానికులు ప్రశాంత్, నవీన్, మధుసూదన్, గడ్డం నవీన్, సల్మాన్‌రాజ్, ప్రవీణ్, విలియం, ప్రవీణ్, సుందర్‌రాజ్, బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎ.వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

'చీకటి పువ్వు' పుస్తకావిష్కరణ

గన్‌ఫౌండ్రీ: స్త్రీల అస్తిత్వానికి చీకటి పువ్వు పుస్తకం ప్రతిరూపమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ప్రముఖ రచయిత్రి కత్తి పద్మ రచించిన చీకటి పువ్వు పుస్తక పరిచయ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య కె.శివారెడ్డి మాట్లాడుతూ.. సమాజంలో జరిగిన వాస్తవ పరిస్థితులను కథల రూపంలో తీసుకురావడం అభినందనీయమన్నారు. మహిళలను చైతన్యపరిచే విధంగా ఉన్నాయని, భవిష్యత్తులో మరిన్ని పుస్తకాలు వ్రాయాలని ఆకాంక్షించారు. సీనియర్ పాత్రికేయులు సతీష్ చందర్ మాట్లాడుతూ.. రచయిత్రి కత్తి పద్మ రచించిన కథలు ఆలోచింప చేసే విధంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయితలు కాత్యాయని, ఏకే.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఏసీపీ దామోదర్‌రెడ్డి

యాకుత్‌పురా/డబీర్‌పురా: రాబోయే శ్రీరామనవమి, రంజాన్ పండుగల నేపథ్యంలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించి నేరా కార్యకలాపాల్లో పాల్గొనవద్దని హెచ్చరించామని మీర్‌చౌక్ డివిజన్ ఏసీపీ సూదిరెడ్డి దామోదర్‌రెడ్డి తెలిపారు. రానున్న శ్రీరామ నవమి, రంజాన్ పండుగలను పురస్కరించుకొని పురానీహవేలిలోని డివిజన్ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ఆయన డివిజన్‌లోని రెయిన్‌బజార్, మీర్‌చౌక్, భవానీనగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని 45 మంది రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రౌడీషీటర్లు ఎలాంటి నేరాలకు పాల్పడకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కుటుంబాలతో గడుపుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ మంచి సత్ప్రవర్తనతో మెలుగుతామని రౌడీషీట్లు చెప్పారన్నారు. చార్మినార్ యునానీ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంచిపెట్టి సేవలు అందిస్తామని వారు తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో మీర్‌చౌక్, భవానీనగర్ ఇన్‌స్పెక్టర్లు అప్పల నాయుడు, మహ్మద్ అంజద్ అలీ, ఎస్సైలు నర్సింహ, రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



ఆమెర్ అలీఖాన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: రంజాన్ మాసంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలంగాణ రాష్ట్ర ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్‌రైట్స్, లిబర్టీస్ సోషల్ జస్టిస్ తెలంగాణరాష్ట్ర కన్వీనర్ ఆమెర్ అలీఖాన్ అన్నారు. ఆదివారం ఆయనను అక్బర్‌బిన్ కబర్ రంజాన్ మాసం రానున్న సందర్భంగా సన్మానించారు. అక్బర్‌బిన్ కబర్ కార్యాలయంలో ఈ జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు ఇమ్రాన్ అలీఖాన్ పాల్గొన్నారు.

సిద్ధమవుతున్న హలీం బట్టీలు



టోలిచౌకి రహ్మత్ హోటల్ వద్ద ..

గోల్కొండ: మార్కెట్‌లో రంజాన్ మాసం సందడి నెలకొంది. రంజాన్ మాసం అంటే గుర్తుకొచ్చేది హలీం, వివిధ రకాల పండ్లు. ఇదిలా ఉండగా రంజాన్ మాసంలో లభించే హలీంకు ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. ప్రత్యేకంగా ఇటుల బట్టీతో తయారయ్యే హలీం రుచి ప్రత్యేకంగా ఉండటమే కాకుండా హలీంలో ఎన్నో పోషకాలు కూడా ఉన్నాయి. రంజాన్ మాసంలో రెస్టారెంట్ల వారు పోటాపోటీగా హలీం అమ్మకాలు సాగిస్తారు. టోలిచౌకితో పాటు గోల్కొండ, అహ్మద్‌నగర్‌లలో పలు రెస్టారెంట్ల వారు 30 సంవత్సరాలుగా హలీం తయారు చేస్తున్నారు. ఈ బట్టీకి కాల్చిన ఇటుకలను వాడుతారు. అంతేకాకుండా ఇందులో సిమెంట్ వాడకుండా ఎర్రమట్టినే వాడుతారు. బట్టీలలో హలీం తయారు చేయడానికి ఎల్‌పీజీ గ్యాస్ కాకుండా కట్టెలనే వాడుతారు. ఈ బట్టీపై డేక్షా (పాత్ర)ను ఉంచుతారు.

'వసంత నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం'

సంతోష్‌నగర్: సంతోష్‌నగర్‌లోని పద్మావతి గోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 22 నుంచి 30వ తేదీ వరకు శ్రీ సీతారామచంద్ర స్వామి వసంత నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చైర్మన్ యుగేందర్‌రెడ్డి, కార్య నిర్వాహణాధికారి జయంతి తెలిపారు. ఈనెల 22వ తేదీన ఉదయం 10 గంటలకు నూతన తెలుగు సంవత్సర పంచాంగం ఆవిష్కరణ ప్రముఖ సంఖ్యాశాస్త్ర నిపుణులు దైవాజ్ఞశర్మతో ఆవిష్కరించనున్నామన్నారు. సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు, రమాదేవి బృందం కూచిపూడి నృత్యం, గంటి సూర్యప్రభతో సంగీత విభావరి, దేవస్థాన ప్రధాన అర్చకులు డాక్టర్ నల్లదీగల శ్రీనివాసాచార్యుల పంచాంగం శ్రావణం నిర్వహి స్తారన్నారు.

టీడీపీకి పూర్వ వైభవం తేవడమే లక్ష్యం

లంగర్‌హౌస్: తెలంగాణలో టీడీపీకి పూర్వ వైభవం తేవడమే లక్ష్యంగా తామంతా పనిచేస్తున్నట్లు టీడీపీ కార్వాన్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ బండారి వెంకటేష్ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో ఆదివారం లంగర్‌హౌస్‌లో ఇంటింటికీ టీడీపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీధుల్లో పెద్ద ఎత్తున్న ర్యాలీ నిర్వహించి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వెంకటేష్, సురేందర్ సింగ్ మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో ప్రజల ఆదరణతో సత్తాచాటుతామన్నారు.

బార్కాస్‌లో ఎమ్మెల్యే పర్యటన



చాంద్రాయణగుట్ట: నియోజకవర్గంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా అభివృద్ధి పనులు చేయడం జరుగుతుందని చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. నియోజకకవర్గంలోని బార్కాస్ డివిజన్‌లో ఆదివారం ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చాంద్రాయణగుట్టలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. బాక్స్‌డ్రెయిన్‌లు, ఫ్లైఓవర్లు, సీసీ, బీటీ రోడ్లు నిర్మిస్తూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నామన్నారు. ఫలక్‌నుమా జూనియర్ కళాశాల, బార్కాస్ పాఠశాలలో విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. కార్పొరేటర్లు షబానా హఫీజ్ పటేల్, ఫహద్ బిన్ అబ్దాద్, రహెమాన్, ఆజం షరీఫ్, సలీం బేగ్, వాహబ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రి వద్ద అన్నదానం చేస్తున్న డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని

అబిడ్స్: టీఎన్జీఓస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా ఆధ్వర్యంలో ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రి వద్ద రోగుల బంధువులకు అన్నదానం నిర్వహించారు. దాదాపు 1000 మంది రోగులకు ఈ అన్నదాన కార్యక్రమం చేపట్టారు. టీఎన్జీఓస్ యూనియన్ హైదరాబాద్, అస్సద్ అన్వార్ మెమోరియల్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో తరచూ అన్నదాన కార్యక్రమాలు చేపడుతున్నట్లు డాక్టర్ ముజీబ్ హుస్సేని తెలిపారు. ఈ సందర్భంగా సయ్యద్ అస్సద్ ఉద్దీన్ జన్మదినాన్ని పురస్కరించుకుని పలు సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు వెల్లడించారు. కేఆర్.రాజ్‌కుమార్, వైదిక్ శాస్త్రి, బి.శంకర్, కుర్రాడి శ్రీనివాస్, మహ్మద్ వహీద్, ఎంఏ ముజీబ్, సయ్యద్ అసదుద్దీన్ పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

అబిడ్స్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని భారతీయ యోగ్ సంస్థాన్ రాష్ట్ర అధ్యక్షుడు సుధీర్ కులకర్ణి పేర్కొన్నారు. యోగ్ సంస్థాన్ ఆధ్వర్యంలో మూడురోజుల పాటు ప్రత్యేక యోగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్ కులకర్ణి మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ ప్రతిరోజూ కొంతసేపు అయినా యోగాసనాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాంపల్లి నియోజకవర్గం ఉపాధ్యక్షుడు మెట్టు వెంకటేష్, భారతీయ యోగ్ సంస్థాన్ సభ్యులు మహేష్ తివారి, లతా మేడమ్, ఎన్ సింగ్ వాలియా, జయశ్రీ, శోభా, కేతన్, దేవేందర్ సింగ్, ఇంద్రజిత్ సింగ్, సత్యనారాయణ సింగ్, ఝాన్సీ పాల్గొన్నారు.



భారతీయ యోగ్ సంస్థాన్ ప్రత్యేక అవగాహన తరగతుల్లో పాల్గొన్న సుధీర్ కులకర్ణి తదితరులు

ఆటోడ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఆటోడ్రైవర్ జేఏసీ చైర్మన్ మహ్మద్ అమానుల్లాఖాన్

సుల్తాన్‌బజార్: నూతన సచివాలయం ప్రారంభోత్సవానికి ముందే ఆటోడ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని లేని పక్షంలో ఏప్రిల్ 30న నిర్వహించే సచివాలయ ప్రారంభోత్సవాన్ని అడ్డుకుంటామని తెలంగాణ ఆటో డ్రైవర్స్ జేఏసీ చైర్మన్ మహ్మద్ అమానుల్లాఖాన్ హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాదిరిగా తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఆటోడ్రైవర్ల సంక్షేమానికి పాటుపడాలన్నారు. అన్ని వర్గాల సమస్యలను పరిష్కరిస్తున్న సీఎం కేసీఆర్ ప్రభుత్వం ఆటోడ్రైవర్లను మాత్రం విస్మరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలక్ట్రిక్ ఆటోల రిజిస్ట్రేషన్‌ను వెంటనే ఆపివేయాలని ఢిల్లీలో మాదిరిగా బైక్ ట్యాక్సీలను నగరంలో నిషేధించాలని కోరారు. లేనిపక్షంలో ప్రగతిభవన్ నుంచి ముఖ్యమంత్రిని బయటకి రాకుండా వేలాది ఆటోలతో రోడ్డుకు అడ్డంగా పెట్టి సచివాలయానికి వెళ్లే రోడ్లన్నీ జామ్ చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జేఏసీ ప్రతినిధులు ఫారుఖ్, రమేష్, రఘు తదితరులు పాల్గొన్నారు.

శ్రీచైతన్యలో ఫ్యామిలీ గ్లోరీ



తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆశీర్వాదం తీసుకుంటున్న విద్యార్థులు

గోల్కొండ: పెద్దలను గౌరవించడంతో పాటు మానవ విలువలు తెలిపేందుకు తమ పాఠశాలలో ఫ్యామిలీ గ్లోరీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని మెహిదీపట్నం శ్రీచైతన్య పాఠశాల జోన్ ఏజీఎం కృష్ణ అన్నారు. ఆదివారం పాఠశాలలో స్మార్ట్ లివింగ్ కార్యక్రమంలో భాగంగా జరిగిన ఫ్యామిలీ గ్లోరీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత నెల రోజులుగా పిల్లలకు మానవతా, కుటుంబ విలువలపై కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆదివారం పాఠశాలలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను విద్యార్థులు పూజించి వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వాతి, ఎగ్జిక్యూటివ్ డీన్ పుల్లారావు, కో ఆర్డినేటర్ రవి, వైస్ ప్రిన్సిపాల్ పల్లవి, డీన్ ఓంకార్, శివ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

యాకుత్‌పురా: మహిళలు స్వయం ఉపాధిని మెరుగుపరుచుకుంటూ ఆర్థికంగా ఎదగాలని ఆంధ్రప్రదేశ్ ప్రొడక్టివిటీ కౌన్సిల్ ప్రిన్సిపాల్ డైరెక్టర్ టి.శ్రీనివాస్ రఘు సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా హైదరాబాద్ న్యూ హోప్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రెయిన్‌బజార్ ఎస్ఆర్టీ కమ్యూనిటీహాల్‌లో మహిళా స్వయం ఉపాధిపై కార్యక్రమం నిర్వహించారు. పలువురు మహిళలు స్వయంగా తయారు చేసి వస్తువులను స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. మహిళలు తమ సొంత తెలివితేటలతో ఆసక్తి గల అంశాల్లో పలు వస్తువులను తయారు చేసి ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. అనంతరం శ్రీనివాస్ రఘుతో పాటు పలువురు మహిళలను ఘనంగా సన్మానించారు. హైదరాబాద్ న్యూ హోప్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు రేహానా బేగం, ప్రొడక్టివిటి కౌన్సిల్ ప్రతినిధులు నసీర్ సిద్దిఖీ, కోటేష్ పాల్గొన్నారు.



బురదమయంగా రోడ్లు

గోల్కొండ: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లు బురదమయంగా మారాయి. గోల్కొండ, టోలిచౌకి షేక్‌పేట్ తదితర డివిజన్లలో పైపులైన్ వేయడానికి తవ్విన తవ్వకాల వద్ద వర్షానికి మట్టి కుప్పలు కాస్త బురద దిబ్బలుగా మారాయి. దీంతో ఆ రోడ్డుపై రాకపోకలు సాగించే వారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. నానల్‌నగర్, గోల్కొండ తదితర ప్రాంతాల్లో సైతం రోడ్లు బురదమయంగా మారాయి. టోలిచౌకి నుంచి గోల్కొండ మోతీ దర్వాజ వెళ్లే రోడ్డుపై రోడ్డు పూర్తిగా బురదమయంగా మారింది. అదే విధంగా టూంబ్స్ రోడ్డు నుంచి గెలాక్సీ వెళ్లే రోడ్డు సైతం బురదమయంగా మారింది. మెహిదీపట్నం, అహ్మద్‌నగర్ తదితర ప్రాంతాల్లో కాలనీల రోడ్లు సైతం అధ్వానంగా తయా రయ్యాయి.



బురదమయంగా మారిన గెలాక్సీ రోడ్డు

వ్యక్తి అదృశ్యం



మహేష్

గోల్కొండ: వ్యక్తి అదృశ్యమైన ఘటన గోల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. గోల్కొండ పోలీసుల వివరాల ప్రకారం.. గోల్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వన్మోర్‌నగర్ నివాసి మహేష్ (30) భార్య మంగమ్మతో కలిసి ఎస్ఆర్ పెట్రోల్ పక్కన నివసిస్తున్నాడు. ఇతను మద్యానికి బానిసయ్యాడు. ఈ విషయంపై తరచూ భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండేవి. మద్యం మానేసి పనికి పొమ్మని మహేష్ భార్య మంగమ్మ భర్తను కోరేది. మహేష్ మాత్రం భార్య మాట వినకుండా ప్రతినిత్యం తాగుతూ ఉండేవాడు. ఈనెల 10న ఉదయం 10 గంటలకు మహేష్ ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. సాయంత్రం కూడా తిరిగి రాలేదు. దీంతో అతని కుటుంబసభ్యులు స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేశారు. జాడ తెలియకపోవడంతో గోల్కొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.